# వెలుగివ్వని దీపం

మళ్ళీ చూశాను అటు దిక్కు.

అత నలాగే కుర్చీలో కూర్చుని నిశ్శబ్దంగా చూస్తున్నాడు ఆకాశంలోకి. చటుక్కున నా చూపు కూడా అటే మళ్ళింది.

నీలి ఆకాశంలో ఒక ఒంటరి పక్షి ఎటో మేఘాలలోకి పరుగెత్తు తోంది. ఎంతో విశాలమైన ఆకాశం. ఒంటరిగా ఎగిరే పక్షి. ఎందుకో మనసు కలుక్కుమంది.

అతన్ని మళ్ళీ పరిశీలనగా చూశాను. అతని కళ్ళనిండా ఒట్టి శూన్యం. ముఖం అప్పుడే తెల్లసున్న మేసిన గోడలా నిర్లిప్తంగా ఉంది.

అతని చేతిలో సిగరెట్టు కాలుతూనే ఉంది. సిగరెట్టును వెలి గిస్తాడు. ఒకటి రెండుసార్లు పీలుస్తాడు. అంతే ఇక సిగరెట్టు వేళ్ళ సందులో కాలి కాలి బూడిదగా మారుతూంటుంది. అంతా కాలింతరవాత ఆ బూడిద గొట్టం వంక చచ్చిపోయిన కొడుకు దిక్కు చూస్తున్న తల్లిలా గుండెలు తరుక్కుపోయేలా దీనంగా చూస్తాడు తరవాత లేచి నిలబడి వెళ్ళిపోతాడు.

ఎటో వెళ్ళిపోతాడు...ఒక్కడే. దాదాపు ఎవ్వరితోనూ మాట్లా డడు. ఎప్పుడూ మవునమే అతని వెంట ఉంటుంది. ఇప్పటిదాకా నేను అతడు అతడని చెబుతున్న అతని పేరు కనకరాజు.

కనకరాజు నా గది పక్క గదిలో ఉంటున్న నా పొరుగు మనిషి. అతనికీ, నాకూ నడమ పరిచయం కానీ, స్నేహం కానీ ఏమీ లేదు. అతను నాకు తెలుసు అంతే.

నాకు ఈ మధ్యనే ఖమ్మంకు ట్రాన్స్‌ఫరైంది వరంగల్ నుంచి బ్రహ్మచారిని...ఒంటరిని...కొత్త ప్రాంతం.... ఖమ్మంలో ఎవరూ పరిచయమున్న వాళ్ళు లేరు. తిండీ పడకా అన్నీ సమస్యలే.

అదృష్టవశాత్తు నాకు ఒక అద్భుతమైన సౌకర్యం దొరికింది.

మా ఆఫీసు ఎదురుగా ఒక హోటలుంది. ఆ హోటల్‌ను నడుపుతున్న కుటుంబం కూడా హోటల్‌కు వెనక భాగాన ఉన్న డాబా ఇంట్లోనే కాపుర ముంటున్నారు. వాళ్ళ పోర్షన్‌కు అనుకునే ఇంకో రెండు గదులున్నాయి.

నేను వెళ్ళేసరికి ఆ రెండు గదుల్లోని ఒక గదిలో కనకరాజు ఒంటరిగా ఉంటున్నాడు. అతనక్కడ ఉండబట్టి నాలుగు నెలలైందనీ, అతను మా ఆఫీసు పక్కనున్న ఆఫీసులోనే ఎల్.డి.సీ.గా పని చేస్తాడనీ కొత్తగా ఆ ఉద్యోగంలో చేరాడనీ తెలిసింది.

కనకరాజు పక్క గది ఖాళీగా ఉంది. హోటల్‌లో తిని, ఈ గదిలో పడుకోవడంలో ఒక తిప్పలేవీ ఉండవని ఆ గది ఖాళీగా ఉన్న సంగతి తెలియగానే టక్కున చేరిపోయాను.

నాకు ప్రత్యేకంగా మూడు హాబీ లున్నాయి. ఒకటి పుస్తకాలు చదవడం రెండు బుర్రలో ఏదైనా 'ఫిట్టింగ్ థాట్' రాగానే దాన్ని కథగా మలచి కథలు రాయడం. మూడు చుట్టు పక్కలున్న మనుషులతో కలుపుగోలుగా మాట్లాడుతూ వాళ్ళలో ఒకనిగా కలిసిపోయి స్నేహాన్ని పృష్టించుకోవడం.

ఈ అభిరుచులన్నీ నన్ను ఇంటిపట్టున ఉంచేవే. అందువల్ల హోటల్ వోనరైన రామారావుగారి కుటుంబంతో పరిచయ మేర్పడి, స్నేహంగా మారి ఆత్మీయతగా స్థిరపడ్డది.

కాని ఆశ్చర్యమేమిటంటే ఈ రెండు నెల్లో నేనూ, కనకరాజూ ఏ రెండుమూడు సార్లో ముక్తసరిగా... అంటే.... "మీ పేరేమిటి సార్" అని నేనంటే—

"కనకరాజు" అని అతను చెప్పడం. "ఒంటరిగా ఉంటున్నారా సార్" అని మళ్ళీ ఒక పిచ్చి మాటడుగుతే—

"అవునండీ" అని అతను సమాధానం చెప్పడం లాంటి పొడి మాటలు మాట్లాడుకున్నాం. అంతకుమించి నేను అతనికి దగ్గిర కాలేక పోయాను. నిజం చెప్పాలంటే నేను దగ్గరగా వస్తున్న కొద్దీ అతనే కావాలని దూరంగా జరిగి పోయేవాడు.

కొందరు వ్యక్తులు ఒంటరిగా ఉండడంలో బ్రహ్మానందాన్ని పొందుతారు. కనకరాజు కూడా అలాంటి కోవకు చెందిన వ్యక్తిగానే అర్థం చేసుకుని ఇక అతనితో స్నేహం చేయాలను ప్రయత్నాన్ని విరమించాను.

కాని కనకరాజుని చూస్తున్నప్పుడల్లా ఖాళీ నీలాకాశాన్ని చూస్తున్నప్పుడు మనసునిండా పరుచుకుని నిశ్శబ్ద గంభీరత అలుక్కుపోయేది నాలో. అతనిలో ఏదో తుఫాను దాగివున్నదనిపించేది. అతను దేన్నో గుప్పిట్లో నిప్పులా బలవంతంగా ఖావిస్తున్నాడనిపించేది. అసలు మనిషే శిలువ వేసిన క్రీస్తులా అర్థ్రితతో కనిపించేవాడు.

ఉమ హోటల్ వోనర్ కూతురు. అప్పుడు ఎస్.ఎస్.సి.లో ఉంది. నాకు తీరిగ్గా ఉన్నప్పుడు లెక్కలు చెప్పించుకునేది నాతో.

అందువల్ల వాళ్ళింట్లోని అందరితో కంటే ఉమతో ఎక్కువ చనువు ఏర్పడింది.

ఒకసారి ఉమ అంది—"కనకరాజు ఎమ్.ఎ. చదివాడు తెలుసా నీకు" అని. "అలాగా" అన్నాను. నిజంగాకూడా కనకరాజు ఎమ్మే చదివి ఉంటాడని నేనెప్పుడూ అనుకోలేదు.

"నువ్వు రాకముందు కనకరాజు వొకసారి ఒక లెక్క చెప్ప మన్నాను" అంది. నిశ్శబ్దంగా ఆమె ముఖంలోకి చూశాను.

"చెప్పలేదు...చెప్పనన్నాడు" అని ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోగానే కనకరాజు అతని గది దిక్కు వస్తూ కనిపించాడు.

ఉమ చెప్పిన తత్వంలో పరిశీలనగా చూశానతన్ని. నేనలా...ఏ కోణంలో చూచినా నా కతనిలో ఎప్పుడూ కనిపించింది ఒట్టి శూన్యమే.

ఈ రెండు నెలలో ఒకే ఒకసారి నేనతని గదిలోకి పోవడం తటస్థించింది. అతని గదిలో ఏమీ ఉండవు. ఒక సూట్‌కేస్ ఒక బెడ్డింగ్. గోడలకు ఒకే ఒక కాలేండర్....అదీ ఆకాశంలో ఒంటరిగా ఎగిరే పక్షిదే—అంతే.

అతను హోటలోనే తినేవాడు. కాని ప్రతిరోజూ రెగ్యులర్‌గా తినేవాడు కాదు. ఇష్టమున్నప్పుడు ఎప్పుడో వచ్చి టేబుల్ ముందు కూర్చునేవాడు. సర్వెంట్స్ వడ్డించేవాళ్ళు.

కనకరాజు ఎప్పుడూ తెల్లని ముతక లాల్చీ, ముతకదే తెల్లని పైజామా వేసుకునేవాడు, కొద్దిగా గడ్డం పెరిగి ఉండేది. తెల్లకళ్ళద్దాలు పెట్టుకునేవాడు. ఈ లక్షణాలు ఉన్న కనకరాజు నాకు ఒక చిత్రమైన వ్యక్తిగా కనిపించేవాడు. అతని గురించి వివరాలు తెలుసుకోవాలని ఎంతో ఉబలాటంగా ఉండేది. కాని ఎవరికీ అతని గురించి స్పష్టంగా తెలియదు.

కనకరాజు రోజూ సాయంకాలం ఆఫీసునుంచి రాగానే స్నానం చేసి కాసేపు ఆకాశంలోకి చూస్తూ కూర్చుని లేచి బయలుదేరి నడుస్తూ అలా ఎప్పుడో వెళ్ళిపోతాడు. తిరిగి రాత్రి ఎప్పుడోగాని రాడు. చాలా సార్లు మేమందరం పడుకుని నిద్రపోయాక రాత్రి ఎప్పుడో వచ్చి—తెల్లవారేసరికి వరండాలో నిద్రపోతూ కనిపించేవాడు.

నేను కనకరాజు దిక్కు చూస్తూ ఈ ఆలోచనల నుంచి తెరుకోకుండానే....కనకరాజు లేచి నిలబడి గదికి తాళం వేసి....మళ్ళీ ఒక సిగరెట్టు వెలిగించుకుని బయటకు బయలుదేరాడు మామూలుగా.

రోజూ ఇతనెటు పోతాడు. ఇన్నిగంటలు ఎక్కడ గడుపుతాడు. అసలితని వ్యాపకా లేమిటి? ఏవైనా వ్యసనాలున్నాయా ఇవన్నీ ప్రశ్నలు ఈ ప్రశ్నలు ఎప్పటినుంచో నన్ను తొలుస్తున్నాయి.

"ఇప్పుడు కనకరాజును అతనికి తెలియకుండా ఫాలో అయి ఈ బోగట్టానంతా ఆరాతీస్తే—" అన్న ఆలోచన వచ్చింది. వెంటనే చటుక్కున లేచి ....ముఖం కడుక్కుని బట్టలేసుకున్నాను.

బయలుదేరుతుండగా ఉమ అడిగింది— "ఎటు వెళ్తున్నావు" అని. "అలా వూర్కే" అని. "ఓహో—చేంజ్ వస్తోందన్నమాట" అని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది లోపలికి.

నేను రోడ్డెక్కేసరికి కనకరాజు రెండు ఫర్లాంగుల దూరం కన్నా ఎక్కువే నడిచాడు. ఇంకా నడుస్తున్నాడు.

ముందు అతనూ వెనక అతనికి తెలియకుండా నేనూ నడుస్తూ నడుస్తూ పైన ఆకాశం నల్లగా తయారయింది. మేఘాలు చిక్కగా అలుముకుని కమ్ముకొస్తున్నాయి. ఏ క్షణాన్నయినా వర్షం రావచ్చనిపిస్తోంది. వాతావరణాన్ని చూస్తే.

కనకరాజు రైల్వేస్టేషన్ దిక్కు నడుస్తున్నాడు. "స్టేషన్‌లో అతనికేం పనబ్బా" నడుస్తున్నాం.

స్టేషన్‌లోకి వచ్చేశాం. నేను అవుట్ గేట్ దగ్గర బయటికి చూస్తూ నిలబడి కనకరాజు కదలికలను గమనిస్తున్నాను.

అతను బుకింగ్ కౌంటర్‌లో చేయి పెట్టి "ప్లాట్‌ఫామ్ టికెట్" అన్నాడు. టికెట్ తీసుకుని ప్లాట్‌ఫామ్ మీదికి నడిచి......అటు వేపు దూరంగా వెళ్ళి—ఆ కోప మనుషులెవరూ లేరు. ప్రశాంతంగా ఉంది. ఒక సిమెంట్ బెంచీపై కూర్చున్నాడు. సిగరెట్టు వెలిగించాడు. మళ్ళీ చూపులను ఆకాశంలోకి గుచ్చి చూస్తున్నాడు శూన్యంగా శూన్యంలోకి.

ప్లాట్ ఫామ్‌పై ఎక్కువ జనం లేరు. ఒక అయిదారుగురు ప్రయాణికులు, కూలీలు, బిఛాణీలు. చాయ్‌లూ అమ్మే కుర్రాళ్లూ వీళ్ళే ఉన్నారు.

నేను గబగబా వెళ్ళి ట్రైన్ టైమ్‌టేబుల్ చూశాను.

ఆ వేళప్పుడు రైళ్ళసలు లేనేలేవు.

మరి ఎవరి కోసమొచ్చాడితను స్టేషన్‌కు.

ఒకటి...రెండు...మూడు...నిమిషాలు గడుస్తున్నాయి. అర గంట గడిచింది. గంట గడిచింది.

కనకరాజు అలాగే కూర్చున్నాడు నిర్లిప్తంగా. పైన మబ్బులు కదలి కదలి...నడుస్తున్న ఏనుగుల్లా ఢీకొని....అరిచి అరిచి వర్షం ప్రారంభమైంది. టపటపా చినుకులు.

జనం పరుగెత్తి చూరు కిందికి సర్దుకుంటున్నారు.

కనకరాజు మాత్రం తడుస్తూనే...నెమ్మదిగా యోగిలా నడుస్తూ గంభీరంగా వస్తున్నాడు. మనిషిలో ఏమీ చలనం లేదు.

అప్పటికే ఎనిమిది దాటింది. కనకరాజు వచ్చి ప్లాట్‌ఫామ్ రూఫ్ కింద ఒక చివర ఒంటరిగా నిలబడి మళ్ళీ ఒక సిగరెట్టు వెలిగించాడు. ఈ రెండు గంటల నిరీక్షణలో రెండు రైళ్లు రావడం, పోవడం జరిగింది.

చివరికి కనకరాజు ఎవరి కోసమో స్టేషన్‌కు రాలేదనీ, అలా ప్లాట్‌ఫామ్‌పై కూర్చోవడం అతని హాబీ అని అనిపించింది నాకు. ఇక వోపిక నశించిపోయి ప్లాట్‌ఫామ్‌పై నున్న బుక్ స్టాల్‌లో ఒక పుస్తకం కొనుక్కుని రిక్షా ఎక్కి ఇంటికి బయలుదేరాను.

రిక్షా దిగి.... నా గది దిక్కు నడుస్తూంటే తాళం వేసి ఉన్న నా గది బయట కుర్చీలో ఒక స్త్రీ కూర్చుని ఉండడం కనిపించింది. ఆమె భుజాల నిండా కొంగును కప్పుకుంది. తెల్లగా, అందంగా కూడా ఉంది. వయస్సు ఇరవై రెండేళ్ళుంటాయేమో.

కాని ఆమెను అంతకు ముందెన్నడూ నేను చూడలేదు. గది దగ్గరకు వెళ్ళేంతలో ఉమ చేతిలో కాఫీ గ్లాసుతో వచ్చేసి "ఈమె కనకరాజు భార్యట. పేరు రాజ్యలక్ష్మి. కనకరాజు నాలుగు నెలల క్రితం ఇంట్లో చెప్పా చెయ్యక పారిపోయి వచ్చాడుట. పాపం వీళ్ళకు ఇద్దరు పాపలు కూడా ఉన్నారట. మొన్న వీళ్ళ వూరి మనిషి ఎవరో ఇక్కడ కనకరాజును చూచినట్లు చెబితే నల్గొండ నుంచి పరుగెత్తు కొచ్చింది. ఇతను రామచంద్ర మూర్తండీ. ఈ గదిలో ఉంటాడు పెద్ద రచయిత కూడా" అని పరిచయం చేసింది.

ఆమె పవినయంగా నమస్కారం చేసింది. మనిషి పువ్వులా నిర్మలంగా ఉంది. రాజ్యలక్ష్మికి కాఫీఇచ్చింది ఉమ, నాకు ఇంకో కాఫీ తేవడానికని లోపలికెళ్ళింది. కనకరాజు ఇంట్లో నుంచి పారిపోయి వచ్చాడా.

ఎమ్ ఏ. చదివి....ఉద్యోగం చేస్తూ...ఇద్దరు పిల్లలు కూడా ఉండి—

ఛీఛీ—ఇదేం పాడు బుద్ధి. ఇంత మంచి భార్యను వదిలి—కనకరాజు మీద మొట్టమొదటిసారిగా అసహ్య మేసింది నాకు. ఆమె దిక్కు జాలిగా చూశాను.

ఎలాగు కనకరాజు వస్తాడు గదా—అప్పుడే చూద్దాం అసలు ఏం జరుగుతుందోనని కూర్చున్నాను. నా వలెనే రామారావు కుటుంబం కూడా ఎదురు చూస్తూంది.

కాని అర్ధరాత్రి దాటినా కనకరాజు రాలేదు.

రాజ్యలక్ష్మి ఈలోగా తమ కుటుంబ పరిస్థితి నంతా దపాలవారీగా చెప్పి అనేకసార్లు కంట తడి పెట్టుకుంది.

ఒంటిగంట దాటింది....రెండు దాటింది ఒక్క రామారావు,నేనూ, రాజ్యలక్ష్మి ముగ్గురమే మేల్కొని ఉన్నాం. మిగతా అందరూ అలసి పడుకున్నారు.

తెల్లవారింది—కనకరాజు రాలేదు. రాజ్యలక్ష్మి ముఖం నిండా ఆందోళన సముద్రపు అలల్లా ఎగిసి పడుతూంది.

ప్రొద్దెక్కి...పది గంటలై ...నేను ఆఫీసుకు వెళ్ళేవేళ కూడా అయింది. ఆఫీసుకు వెళ్ళాను. మనసూ చేపలతో నిండిన వలలా ఉంది. కళ్ళు నిద్రలేక ఎర్రగా మండుతున్నాయి.

పదకొండు తరువాత ప్యూన్ పోస్టులో వచ్చిన కవరు నొకదానిని తెచ్చిచ్చిపోయాడు విప్పాను...అది కనకరాజు రాసింది.

శ్రీ రామచంద్రమూర్తిగారికి,

నమస్కారం,

ఇప్పటికి నా భార్య రాజ్యలక్ష్మి నా గదికి వచ్చి ఉంటుంది. ఆమె ద్వారా అంతా విన్న మీరు బహుశా ఇప్పటికి నన్ను అసహ్యించుకుంటుంటారు. కాని ఈ క్రింది రెండు వాక్యాలు చదవండి.

నేను ఎమ్మే చదివాడు. ఉద్యోగం చేస్తున్నాను. అందమైన భార్యా, మణుల్లాంటి ఇద్దరు పాపలు ఉన్నారు. ఇంతవరకు నేను సంపాదించిన ఇరవై వేల దాకా రూపాయలు కూడా ఉన్నాయి.

కాని...నాలుగు నెలల క్రితం నేను కొన్ని శారీరక బాధలతో మెడికల్ చెకప్ చేయించుకున్నప్పుడు తెలిందేమిటంటే...నాకు బ్లడ్ కాన్సర్ ఉందని. ఇక నా జీవితం ఆరు నెలలేనని. ఈ విషయం నా భార్యకు చెబితే మమతను చంపుకోలేక పోగా, ఉన్న ఇరవై వేలను నా కోసం ఖర్చుపెట్టి వైద్యం చేయిస్తుంది. అయినా నేను బ్రతకను తర్వాత నా భార్యా పిల్లలు బిచ్చగాండ్లయి పోతారు. అది నేను భరించలేను...అందుకే అజ్ఞాతంలోకి పారిపోయి వచ్చాను.

ఇప్పుడు నేను వెలుగివ్వని దీపాన్ని ఉద్యోగానికి రాజీనామా పంపించాను. ఇక మళ్ళీ వెళుతున్నాను ఎటో ఒక తుపానులోకి.

నేను ఇక్కడినుంచి కూడా పారిపోయానని రాజ్యలక్ష్మికి చెప్పి పుణ్యం కట్టుకోండి. కథనంతా దయచేసి ఆమెకు చెప్పకండి.

హృదయమున్న మీరు నన్ను క్షమిస్తారనే ఆశిస్తాను. సెలవు.

కనకరాజు

ఆ రోజు మధ్యాహ్నం—

"కనకరాజు ఇక్కడినుండి కూడా పారిపోయాడండి. వాళ్ళ ఆఫీసులో ఎంక్వయిరీ చేశాను. విన్ననే రాజీనామా చేశాడట'' అని రాజ్యలక్ష్మితో చెబుతున్నప్పుడు నా కళ్ళలో సముద్రాలు పొంగాయి.

రాజ్యలక్ష్మి నిశ్శబ్దంగా తలవంచుకొని నిలబడ్డది, భుజాల చుట్టూ కొంగు చుట్టుకొని.

టపటపా రెండు కన్నీటి బొట్లు రాలిపడ్డాయి—నేలమీద తెగిన నక్షత్రాల్లా.

నెలరోజులు అతన్ని తినేసిన తర్వాత ఓరోజు కనకరాజు దిన పత్రిక చూస్తూంటే....నాన్నా,

నీ మీద బెంగతో అమ్మ చచిపోయింది. మా కోసమైన రావా.... మా కన్నీళ్ళను ఒక్కసారి చూడు నాన్నా...

ఇట్లు
పాప......
బాబు.......

ప్రక్కన తన ఫోటో—

కనకరాజు హృదయంలో సముద్రాలు అరుస్తున్నాయి కోటి గొంతులతో...

చూస్తున్నాడు...ఒట్టి శిలలా.